నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 నల్లగొండ, బుధవారం 20 నవంబర్ 2024 NALGONDA

# గజ గజ

- జిల్లాలో భారీగా తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- నల్లగొండలో 16.8, సూర్యాపేటలో 17.5 డిగ్రీలు నమోదు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : చలికాలం ప్రారంభంలోనే జనం వణికిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగైదు రోజులుగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నాయి. యాదాద్రి జిల్లా రాజాపేటలో అతి తక్కువగా 12.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండలో 16.8, సూర్యాపేటలో 17.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8, 9 గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంటున్నది. తెల్లవారు జామున తప్పనిసరి బయటకు వెళ్లే పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, కార్మికులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5నుంచి 6గంటల తర్వాత చలి గాలులు వీస్తుండటంతో జనం ఇండ్లకే పరిమితమవుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కిష్టపాటి అంజిరెడ్డి మాతృమూర్తి కిష్టపాటి కామేశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి తదితరులు

# లక్ష్యం 7.50 లక్షలు... కొన్నది 1.19 లక్షలు

## ధాన్యం కొనుగోళ్లలో అంచనాలు తప్పుతున్న అధికారుల లెక్కలు

### ఇంకా సెంటర్లల్లో ఉన్నది మరో 68వేల మెట్రిక్ టన్నులు

- వరి కోతలు 70శాతం పూర్తి.. మిగిలి ఉన్నది మరో 30శాతమే..
- చివరి నాటికి మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా రావడం గగనమే
- సెంటర్లు ప్రారంభించేనాటికే అమ్మిన నల్లగొండ, నకిరేకల్ రైతులు
- సెంటర్ల ఏర్పాటు.. ఆపై మిల్లుల ట్యాగింగ్ ఆలస్యమే కారణం..!



ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న హమాలీలు

వానకాలం సీజన్ ధాన్యం కొనడానికి జిల్లాలో సెంటర్లు ప్రారంభించి నెల పదిహేను రోజులయ్యింది. 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి ఇప్పటి వరకు కొన్నది 1.19లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఇంకా సెంటర్లల్లో 68వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్టు సివిల్ సప్లయ్ అదికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నాన్‌ఆయకట్టులో అంటే నల్లగొండ, నకిరేకల్, మునుగోడులో ఇప్పటికే కోతలు పూర్తి కాగా ఆయకట్టు ప్రాంతాలైన మిర్యాలగూడ, సాగర్‌తో పాటు దేవరకొండలో ఇంకా పూర్తి కాలేదని, జిల్లాలో మొత్తంగా ఇప్పటి వరకు 60శాతం కోతలు పూర్తి కాగా ఇంకో 40శాతం అదీనూ సన్నాలు మాత్రమే ఉన్నట్టు వ్యవసాయ శాఖ చెప్తున్నది. అంటే మహా అంటే చివరి వరకు మూడు లక్షల వరకు అధికార యంత్రాంగం కొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ లెక్కలు అంచనాలు తప్పడానికి కారణం సెంటర్ల ప్రారంభంతోపాటు మిల్లుల ట్యాగింగ్ ఆలస్యం కావడం వల్లేనని సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. ఈ తతంగం పూర్తయ్యే వరకే నల్లగొండ, నకిరేకల్ రైతులు పూర్తిగా తమ ధాన్యాన్ని మిల్లుల్లో అమ్మారని ఆ శాఖల యంత్రాంగం అనడం గమనార్హం.

– నల్లగొండ, నవంబర్ 19

### 45 రోజులైనా..

నల్లగొండ జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 5.20లక్షల ఎకరాల్లో సన్న, దొడ్డు రకం వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో మొత్తంగా 12.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా స్థానిక అవసరాలు పోను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాధారణంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్టోబర్-1 నుంచే సెంటర్లు ప్రారంభిస్తుండగా ఈ సారి అక్టోబర్-10 తర్వాత అది కూడా విడుతల వారీగా..మొత్తంగా 340 కేంద్రాలు ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో దొడ్డు ధాన్యం 1.18లక్షల మెట్రిక్ టన్నులు, సన్న ధాన్యం 1179 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారు. ఇంకా ఆయా సెంటర్లల్లో తేమ శాతం రాని ధాన్యం కుప్పలు మరో 68వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

### ఆదిలోనే అమ్ముకున్న నాన్ ఆయకట్టు రైతులు

నాన్‌ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజక వర్గాలకు చెందిన రైతులు ఆదిలోనే మిల్లుల్లో దొడ్డు ధాన్యం అమ్మినట్లు పలు శాఖల అధికారులు, రైతులు అంటున్నారు. జిల్లాలో 60శాతం కోతలు దొడ్డు ధాన్యం పూర్తి అయినప్పటికీ ఇప్పటి వరకు 1.19లక్షల మెట్రిక్ టన్నులే కొన్నారు. దొడ్డు ధాన్యమే పలు కారణాలతో సెంటర్లకు తేని రైతులు సన్న ధాన్యం ఎలా తెస్తారనేదే ప్రశ్న. ఈ కారణాల నేపథ్యంలో 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యానికి నాలుగు నుంచి ఐదు లక్షలకు మించదని తెలుస్తుంది.

### 60శాతం పూర్తయిన కోతలు..

జిల్లాలో ఈ సీజన్‌లో 5.20లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా అందులో 2.50లక్షల ఎకరాల్లో సన్నాలు, 2.70లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు సాగు చేశారు. ఇప్పటికే దొడ్డు ధాన్యం పూర్తిగా కోయగా, సన్నాలు మాత్రం ఇంకో 40 శాతం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంటున్నది. ప్రధానంగా నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, నకిరేకల్, మునుగోడుతో పాటు దేవరకొండలో దొడ్డు రకం సాగు ఎక్కువగా అవుతుండగా నాగార్జున సాగర్, మిర్యాలగూడలో సన్న రకం సాగవుతుంది. ప్రస్తుతం సాగర్, దేవరకొండ, మిర్యాలగూడలోనే వరి కోతలు 40శాతం మేరకు ఉన్నాయి. సాధారణంగా దొడ్డు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో, సన్న ధాన్యాన్ని మిల్లుల్లో అమ్ముతారు. ఇప్పటికే దొడ్డు ధాన్యం కోతలు 90శాతం పూర్తి కాగా పది శాతం మాత్రమే ఉన్నాయి. ఇప్పటి వరకు కొన్నది..సెంటర్లల్లో ఉన్న దానితో పాటు తప్ప కోత దశలో ఉన్న ఆ పది శాతం దొడ్డు ధాన్యం మాత్రమే సెంటర్లకు వచ్చే అవకాశం ఉన్నది.. ఇక సన్నాలకు మిల్లుల్లో రూ.2300లకు పైగా మిల్లుల్లోనే అది కూడా 25 నుంచి 30శాతం తేమ శాతం ఉన్న ధాన్యానికి ఇస్తున్నారు. సెంటర్లల్లో సన్న ధాన్యం పోయాలంటే 17శాతం వచ్చే వరకు ఆరపెట్టడం ప్రయాసతోపాటు ఆరబెట్టడం వల్ల 20 నుంచి 25శాతం నష్టం జరుగుతుందని.. అందుకే మిల్లుల్లోకి తీసుకెళ్తున్నట్లు రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కోస్తున్న సన్నాలు ఏ మేరకు సెంటర్లకు వస్తాయో చూడాలని సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. ఏదేమైనా చివరినాటికి కూడా మూడు లక్షల టన్నులు మించి కొనుగోళ్లు జరిగే అవకాశం ఉండదని పలువురి అంచనా.

### ఇప్పటి వరకు 1.19లక్షల మెట్రిక్ టన్నులు కొన్నాం

జిల్లా వ్యాప్తంగా 340 కేంద్రాలు ప్రారంభించి ఇప్పటివరకు 1.19లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ఇంకా ఆయా సెంటర్లల్లో సుమారు 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నందున ఎప్పుడికప్పుడు తేమ శాతం చూసి కొనుగోలు చేస్తున్నాం. ఇంకా కోతలు కూడా పూర్తి కానుందున రైతులు సెంటర్లకు తెచ్చిన ప్రతి గింజా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు కూడా ఇప్పటి వరకు రూ.276కోట్లకు గానూ రూ.175కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం.

–హరీశ్, సివిల్ సప్లయ్ డీఎం, నల్లగొండ

# కేసీఆర్ చలువ వల్లే రాష్ట్రంలో ఇంత పంట దిగుబడి

- కాళేశ్వరంపై బురద జల్లడం మానుకోవాలి
- మిల్లర్ల చేతిలో దోపిడీకి గురవుతున్న రైతులు
- మంత్రుల మామూళ్లకు కక్కుర్తిపడడం వల్లే రైతు దగా
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

పాలకవీడు, నవంబర్ 19 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పట్టుదల, కృషితోనే నేడు రాష్ట్రంలో ఇంత ధాన్యం దిగుబడి అవుతున్నదని, దానిని కాంగ్రెస్ పార్టీ నాయకులు గమనించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పాలకవీడు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కిష్టపాటి అంజిరెడ్డి మాతృమూర్తి కిష్టపాటి కామేశ్వరమ్మ ఇటీవల మృతి చెందగా మంగళవారం గుడుగుంట్ల పాలెంలో ఆయనను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నిత్యం ఎంత ధాన్యం కొనుగోలు చేశామనే విషయమై మాజీ సీఎం కేసీఆర్ రివ్యూ నిర్వహించేవారని, కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని తెలిపారు. రాష్ట్ర మంత్రులు చెబుతున్న ధాన్యం లెక్కలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత ధాన్యం పండింది, ఎంత కొనుగోలు చేశామో చెప్పే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కనీసం సివిల్ సప్లయ్ అధికారులు కూడా బహిరంగంగా చెప్పలేని పరిస్థితి ఉందని తెలిపారు. అబద్ధాలతో కాలం వెల్లబుచ్చుతున్నారే తప్ప ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కాళేశ్వరం నీటితో సంబంధం లేకుండానే ఇంత పంట పండిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల చిల్లర మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి పైకి వచ్చిన ప్రతి చుక్క నీరు కూడా కాళేశ్వరంలో భాగంగా కేసీఆర్ తీయించిన కాల్వలు, డ్యామ్‌లు, సొరంగాలే, బాహుబలి మోటర్లే ద్వారానేనని తెలిపారు. ఏడాది గడిచినా నీటి పారుదల శాఖ మంత్రికి ఏ కాల్వ ఎక్కడి నుంచి వస్తుందో తెలియదన్నారు. సూర్యాపేట జిల్లాలోని చాలా మండలాల్లో కాళేశ్వరం నీళ్లు పారుతున్నాయని తెలిపారు. వ్యవసాయంపై అనుభవం లేని రేవంత్‌రెడ్డి సీఎం కావడం, మంత్రులు కూడా ఉండడం బాధాకరమని ఎద్దేవా చేశారు. కనీసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వ్యవసాయంపై అనుభవం ఉన్నప్పటికీ ఆయన కూడా మాట్లాడలేని పరిస్థితి ఉందన్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎవరు మాట్లాడినా ఇప్పటి వరకు ఎన్ని లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించారనే విషయం చెప్పలేక పోతున్నారని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆదుకోవడం వల్లనే వారి మోహంలో నవ్వు కనిపించిందని, కానీ ఇప్పుడు రైతుల మోహంలో ఆ నవ్వు కనిపించడం లేదని తెలిపారు. ఇప్పటికే రైతు బంధు, రైతు భరోసా కలిపి సుమారు రూ. 20 వేల కోట్లు ఎగగొట్టారన్నారు. రుణమాఫీ మొదటిసారి రూ. 12వేల కోట్లు, రెండోసారి కేవలం రూ. 150 కోట్లు మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. ఇప్పటికీ ముఖ్యమంత్రికి వ్యవసాయంలో ఏం జరుగుతుందో తెలియదని, మంత్రుల పరిస్థితి కూడా అదే తీరుగా ఉందని చెప్పారు. అధికారులను పిలిచి ఏవో కాకి లెక్కలు వేసి చేతులు దులుపుకుంటున్నారని, అబద్ధాలతో పొద్దుగూకదని, మళ్లీ సూర్యుడు వస్తాడు.. వెలుతురు వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల పక్షాన పోరాడుతారని, తాము అడిగే వరకు అధికారులు ఎవరు కూడా మిల్లర్లను మద్దతు ధరపై ప్రశ్నించలేదన్నారు. మంత్రులు కొంత మంది మిల్లర్లతో కుమ్మక్కు కావడంతో మిల్లర్లు రైతులు దోచుకుంటున్నారని ఆరోపించారు. సివిల్ సప్లయ్ మంత్రి ఉత్తమ్ ప్రతి రోజూ అధికారులతో సమావేశం నిర్వహించాలని కోరారు. హుజూర్‌నగర్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించింది ఇక్కడి రైతులే, అలాంటి వారికి అన్యాయం జరురకుండా చూడాల్సిన బాధ్యత తమదేనని సూచించారు. ఇప్పటికైనా మంత్రులు రైతుల బాదలను అర్థం చేసుకోవాలని, కేసీఆర్‌పైన, కాళేశ్వరంపైన బురద జల్లడం మానుకోవాలని తెలిపారు. అనంతర శూన్యపహాడ్ గ్రామంలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సఫావత్ చిన్నీ చిత్రపటానికి జగదీశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజక వర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నేరేడుచర్ల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, హుజూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిపాల ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు మారిపెద్ది శ్రీను, ఎల్లబోయిన లింగయ్య, తాటికొండ వెంకట్‌రెడ్డి, రాపోలు నవీన్, గౌష్, అనంతు శ్రీను, ముల్కల పిల్లి రాంబాబు, పసుపులేటి సైదులు, నాగరాజు, అశోక్‌నాయక్, లక్ష్మీనారాయణ, భిక్షం, సుదర్శన్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

# ట్రామా కేర్ సెంటర్ ఏర్పాట్లను పూర్తి చేయాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



పామనుగుండ్లలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కట్టంగూర్, నవంబర్ 19 : ట్రామా కేర్ సెంటర్ ప్రారంభోత్సవ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కట్టంగూర్ మండలంలోని పామనుగుండ్ల గ్రామంలో జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేయనున్న ట్రామా కేర్ సెంటర్ ప్రారంభోత్సవ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని జాతీయ రహదారి సమీపంలో 93 సర్వే నంబర్‌లోని ఎకరం భూమి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అనువైనదిగా గుర్తించినట్లు తెలిపారు. జాతీయ రహదారి, కేర్ సెంటర్ స్థలం మధ్య ఉన్న వరద కాల్వలో కల్వర్టు నిర్మించాలని అధికారులకు సూచించారు. త్వరలో కేర్ సెంటర్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఆర్ఐ సిరిగిరి కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జయసుధ, జీపీ సిబ్బంది బండారు మధు, బండారు ఆనంద్ ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

# పీఆర్‌సీ, డీఏ ప్రకటించాలి

### కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన

నల్లగొండ, నవంబర్ 19 : పెన్షనర్లకు రెండో పీఆర్‌సీ, నాల్గో డీఏను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చి 11నెలలు అయినా చేయక పోవడం సరికాదన్నారు. నాలుగో డీఏతోపాటు రెండో పీఆర్‌సీని జూలై 2023 నుంచి 30శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కుబేర్‌లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెన్షనర్ల సీపీపీ మినహాయింపులను 12ఏండ్లకు కుదించాలని తెలిపారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, మాజీ రాష్ట్ర కార్యదర్శి కుంభం సత్తి రెడ్డి, పాదూరి విద్యాసాగర్ రెడ్డి, ఎండీ అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేశ్, గుండాల భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సైతం బహిష్కరణ





ఎంజీయూ ఎదుట నిరసన తెలుపుతున్న ఉమ్మడి జిల్లా ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు

- ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో యాజమాన్యాల నిర్ణయం
- నెలరోజుల క్రితం ఇచ్చిన హామీ మరిచిన సర్కారు..
- మళ్లీ ఆందోళన బాటలో కళాశాలలు

ప్రైవేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు మళ్లీ కళాశాలల బంద్‌కు సిద్ధమయ్యాయి. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను కూడా బహిష్కరించనున్నాయి. ఇప్పటికే దసరా సెలవుల తర్వాత అక్టోబర్ 14నుంచి 18వరకు నిరవధిక బంద్ పాటించగా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించక పోవడంతో మళ్లీ పోరాట పట్టాయి.

– రామగిరి, నవంబర్ 19

### కళాశాలలపై తీవ్ర భారం

ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలు ప్రభుత్వం అందజేసే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి అర్హత గల విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నాయి. అందుకు అయ్యే ఖర్చులను ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు భరిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా కళాశాలలకు ప్రభుత్వం రూ.150 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాల్సి ఉంది. గత మూడేండ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోయినా కళాశాలలను నెట్టుకుంటూ వచ్చాయి. అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, యూనివర్సిటీ రుసుములు, బిల్డింగ్ ట్యాక్స్ చెల్లించడానికి నానా అవస్థలు పడుతున్నాయి. అప్పు చేసి చెల్లించాల్సి వస్తున్నదని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా అధికారంలోకి రాగానే ప్రైవేట్ కళాశాలలకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిగా చెల్లిస్తామని, ప్రతి సంవత్సరం బకాయి లేకుండా ఇస్తామని హామీ ఇచ్చిందని.. కానీ అవన్నీ వట్టి మాటలే అని తేలిపోయిందని మండిపడుతున్నాయి.

### పూర్తి బకాయిలు చెల్లించి ఆదుకోవాలి

ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం రాక పోవడంతో నిరుద్యోగులమై తాము పేద, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే సంకల్పంతో మాతోపాటు మరో కొంతమంది నిరుద్యోగులైన అధ్యాపకులకు ఆసరా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినవే ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలు. మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో అధ్యాపకుల జీతాలు, బిల్డింగ్ అద్దెలు తదితర వాటిని అప్పులు చేసి చెల్లిస్తున్నాం. దీంతో కళాశాలల యాజమాన్యాల పరిస్థితి దయనీయంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకూ నిరవధిక బంద్ కొనసాగిస్తాం. సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తాం. తిరిగి కళాశాలలు తెరవగానే విద్యార్థులకు నష్టం జరుగకుండా అదనపు తరగతులు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటాం.

-మారం నాగేందర్‌రెడ్డి, టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు, నల్లగొండ

### గత నెలలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గత నెలలో కళాశాలల నిరవధిక బంద్ పాటించిన సమయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వారంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో మళ్లీ కళాశాలలను యాథావిధిగా కొనసాగించాం. హామీ ఇచ్చి నెల రోజులు గడిచినప్పటికీ వాటిని చెల్లించకపోవడంతోనే మళ్లీ ఆందోళనకు సిద్ధమయ్యాం. వెంటనే బకాయిలు చెల్లించాలి అందుకోవాలి.

- డి.ప్రవీణ్, కోశాధికారి, టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్, యాదాద్రి భువనగిరి

### అప్పుల ఊబిలోకి ప్రైవేట్ కళాశాలలు

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయాలి. అప్పులు చేసి అద్దెలు, జీతాలు చెల్లించే పరిస్థితి యాజమాన్యాలకు ఇక లేదు. అనివార్య పరిస్థితుల్లోకి ప్రభుత్వమే యాజమాన్యాలను నెట్టివేసింది. పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించి కళాశాల అభివృద్ధికి సహకరించాలి.

- ఎం. సైదారావు, ప్రధాన కార్యదర్శి, టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్, సూర్యాపేట

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకూ ఆందోళన

### ఎంజీయూ వీసీకి డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల వినతి

దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్న ఫీజు రీయింబర్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ అప్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డికి వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే చెల్లించాలని, అంతవరకు కళాశాలలను నిరవధికంగా ఈ నెల 20 నుంచి బంద్ పెడుతున్నామని తెలిపారు. ఈ నెల 21 నుంచి జరిగే విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబోమని చెప్పారు. ఈ సందర్భంగా వర్సిటీ ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేశారు. అంతకు ముందు వీసీకి వినతి పత్రం వచ్చే క్రమంలో కళాశాలల యాజమాన్యాలు, వీసీకి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొంత అలజడి జరిగింది. తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని యాజమాన్యాలు కోరడంతో వీసీ శాంతించారు. కార్యక్రమంలో టీఏడీపీసీఎంఏ ఎంజీయూ అధ్యక్షుడు మారం నాగేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సైదారావు, కోశాధికారి డి.ప్రవీణ్‌కుమార్, ఆ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు, రాష్ట్ర సభ్యులు టి.శ్రీనివాస్‌రెడ్డి, కె.రాంమోహన్, గుండబోయిన జానయ్య, భాస్కర్‌రావు, యాదగిరి, శంకరయ్య, సత్యం, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.